ఒక ఇంటర్వ్యూ కథ

వసుంధర

"రిజిస్టర్డ్ లెటర్—" అన్నాడు పోస్టుమాన్.

సుదర్శనం సంతకం పెట్టి కవరు తీసుకుని చించి లోపలి ఉత్తరం చదువుకున్నాడు. అతడికేసే ఆత్రుతగా చూస్తున్న సుబ్రహ్మణ్యం—"రిజిస్టర్డుపోస్టులో వచ్చింది. అపాయింట్ మెంటు ఆర్డరా?" అన్నాడు.

"కాదు—ఇంటర్వ్యూ లెటరు—" అన్నాడు సుదర్శనం.

"నీ ముఖం చూసి అలాగే అనుకున్నాలే—" అంటూ సుబ్రహ్మణ్యం నిట్టూర్చాడు.

"అలా దిగులుపడకు నాన్నా! ఈ ఇంటర్వ్యూ లెటరు ఇంచుమించు అపాయింట్ మెంటు ఆర్డరులాంటిదే" అన్నాడు సుదర్శనం.

ఎందుకని కూడా సుబ్రహ్మణ్యం అడగలేదు—"పెళ్ళి చేసుకుంటేనే ప్రేయసీ ప్రియులు భార్యాభర్తలవుతారు. ఇంటర్వ్యూ లెటరు ప్రేమలేఖలాంటిది—"

అన్నాడాయన.

"చూడమ్మా—నాన్న నన్నిలా నిరుత్సాహ పరుస్తున్నాడో!" అన్నాడు సుదర్శనం నిరుత్సాహంగా.

"బుద్ధిలో ఈయన శల్యుణ్ణి చంపి పుట్టారులే కానీ—ఇంతకీ ఈ ఇంటర్వ్యూమీద నీకు బాగా నమ్మకమెందుకుంటో చెప్పు—" అంది సుదర్శనం తల్లి కమలమ్మ కొడుకు వంక ఆప్యాయంగా చూస్తూ.

"ఈ ఊళ్ళోనే వెంకోజీరావుగారి కాలేజి వుంది కదా—అది ప్రైవేటు కాలేజి అయినప్పటికీ జీతాలూ అవీ కచ్చితంగా ఇచ్చేస్తారుట. అందులో ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టుకి నేను అప్లై చేశాను. నాకు ఎమ్మేలో ఫస్టు క్లాసు వచ్చిందిగా! ప్రిన్సిపాలాఫీసులో పనిచేసే ఆనందరావు చెప్పాడు—అప్లై చేసే నేను తప్పకుండా సెలక్టవుతానని!" అన్నాడు సుదర్శనం.

"ఎందుట? అప్లై చేసేవాళ్ళ కింకెవ్వరికీ ఫస్టుక్లాసు లుండవుటా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఎందుకుండవు? కానీ నాకు ఫస్టు క్లాసు మాత్రమే కాక మంచి మార్కులుకూడా వచ్చాయి. ఆపైన ఆ కాలేజీ ప్రిన్సిపాలు మోహనమూర్తిగారు రెకమెండేషన్లకు లొంగడట. ఫస్టుక్లాసు—ఎక్కువ మార్కులు—ఆపైన ఇంటర్వ్యూ పెర్ఫార్మెన్స్—....ఇంటర్వ్యూలో నేను దంచికొట్టేస్తాను తెలుసా?" అన్నాడు సుదర్శనం.

"ఇంటర్వ్యూ లెందుకో తెలుసా? బాగా చదువుకున్న వాళ్ళను తప్పించి—తమకిష్టమైన వాళ్ళను ఎన్నుకునేందుకు...." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇంతకీ అవకాశమిస్తే మీరే వాడికీ ఉద్యోగమిచ్చేలా లేరు—" అంది కమలమ్మ.

"అదేమిటే అలాగంటావు. వాడికుద్యోగం రావాలనే కదా నా కోరిక. ఎటొచ్చీ ఇంటర్వ్యూకి ముందే లేనిపోని ఆశలు పెంచుకోవడం నాకిష్టముండదు. ప్రపంచం తెలిసిన వాణ్ణి కాబట్టి అంతా వివరించి చెబుతున్నాను—...."

"నాన్నా! ఈ ప్రపంచంలో మనిషి ప్రాణాలు నిలబెడుతున్నది ఆశ ఒక్కటే!" అన్నాడు సుదర్శనం వేదాంతిలా.

"ఆశను ఎక్కువగా నమ్ముకున్నవాడు తన ప్రాణాలు నిలబెట్టుకోవడం సంగతలాగున్నా — నిరాశ ఎదురైనపుడు—యెదుటివాళ్ళ ప్రాణాలు తీయాలనుకునేటంత ఘోరావేశానికి గురి అవుతాడు—" అన్నాడు సుబ్రహ్మణ్యం.

కమలమ్మ ఈ మాటలు విని కంగారుగా ముందు భర్త వంక, తర్వాత కొడుకు వంకా చూసింది. భర్త కళ్ళలో ఆశ కనబడింది.

2

పార్కులో ఓ మూల ఆ జంట కూర్చున్నారు.

"నిన్న రాలేదేం సుభాష్—" అంది సుశీల.

"మా నాన్న దగ్గర్నించి ఉత్తరం వచ్చి మనసు పాడైంది—" అన్నాడు సుభాష్ ఆదోలా.

"ఏం రాశారేమిటి—మీ నాన్నగారు...."

"నాకోసం నాలుగు సంబంధాలున్నాయట. అందరూ యాభై వేలకుపైగా కట్నమిస్తానంటున్నారట....—"

సుశీల ముఖం మాడిపోయింది-"మగ పుట్టుక పుట్టావు. అదృష్టవంతుడివి" అందామె.

"నువ్వలాగంటున్నావు. నువ్వు భార్యగా దొరక్కపోతే నా అంత దురదృష్టవంతుడుండడని నేననుకుంటాను"

అన్నాడు సుభాష్.

సుశీల కళ్ళు మెరిశాయి—"నిజంగా?" అందామె.

"ఈ ప్రపంచంలో నీవు తప్ప వేరెవ్వరికీ నేను నిజం చెప్పను. ఎవరైనా సరే—నానుంచి నిజం రాబట్టాలంటే నిన్నుపయోగించుకోవాల్సిందే...."

సుశీల ముఖంలో గర్వం కనబడింది—"అయితే మీ నాన్నగారికేమని రాస్తావు? మన ప్రేమ గురించి చెప్పేస్తావా?"

"మన ప్రేమ గురించి చెప్పేయగానే అయన నన్నింట్లోంచి గెంటేస్తాడు. అదీ నా భయం...."

"నేనుండగా నీవు భయమెందుకు?" అంది సుశీల.

"ఎందుకో చెప్పనా?" అన్నాడు సుభాష్.

అతడిదా ఊరు కాదు. అతడి బాబాయా ఊళ్ళో ఉంటున్నాడు. ఆయనేమో రెండు నెలల క్రితం ఫారిన్ వెళ్ళాడు. ఆయనకో పదైనిమిదేళ్ళ కూతురూ, పద్నాలుగేళ్ళ కొడుకూ ఉన్నారు. అతడి పిన్ని సుభాష్‌ను కొన్నాళ్ళపాటు తన దగ్గర వచ్చి ఉండమని కోరింది. ఇంకో నెల్లాళ్ళలో బాబాయొచ్చేదాకా అతడిక్కడే ఉంటాడు.

ప్రస్తుతం సుభాష్ ఎమ్మే ప్యాసై ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఖాళీగా వున్నాడు కాబట్టి తోడుగా ఉండడానికి పిన్ని అతణ్ని రప్పించుకుంది. పిన్నికూతురు రత్నకుమారికి సుశీల స్నేహితురాలు. ఆ విధంగా సుశీలకూ సుభాష్‌కీ పరిచయమైంది. తొలి పరిచయంలోనే ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రేమ పుట్టింది. అందులోనూ సుభాష్‌కి చొరవ ఎక్కువ. సుశీల అతడంటే బాగా ఆకర్షించబడింది.

"నెల్లాళ్ళలో మా ఇంటికి తిరిగి వెళ్ళిపోవాలి. మా నాన్న నన్నింట్లోంచి గెంటేస్తే ఎవరు నన్నాదరిస్తారు? ఎవరాదరిస్తే వాళ్ళ మీద నాన్న పగబట్టేస్తాడు. అందుకని నా కాళ్ళమీద నేనే నిలబడేదాకా ఆయనతో మన ప్రేమ సంగతి చెప్పలేను...." అన్నాడు సుభాష్.

"చాలామంది రచయితలు, రాసినట్లు ప్రేమ కథల్లో అబ్బాయిలు తండ్రి చాటు బిడ్డలు. అసలబ్బాయిలు అమ్మాయిలను మోసం చేయడానికే ప్రేమిస్తారని నా నమ్మకం...."

"అబ్బాయిలూ అమ్మాయిలూ అంటూ డొంకతిరుగుడు కబుర్లెందుకూ? నా గురించి నువ్వేమనుకుంటున్నావో చెప్పు...."

"ఈ ఊళ్లో మూణ్నెల్లుండాలి. ఇరవై నాలుగ్గంటలూ పిన్ని, చెల్లెలు, తమ్ముడులతో కూర్చుంటే ఏం కాలక్షేపమవుతుంది. నీకు రొమాన్స్ కావాలి. నాతో స్నేహం చేశావు. తెలివిగా ఆకర్షించావు. మూడు నెలలపాటు నీకు మధురమైన కాలక్షేపం. ఆ తర్వాత నాకు మిగిలేవి కలలు. నువ్వింకో అమ్మాయిని వెతుక్కుంటావు...."

"సుశీలా!" అన్నాడు సుభాష్ — "నువ్విలాగనడం చాలా అన్యాయం. నేను నిన్ను ఏకాంతగా కలుసుకుందుకు ప్రయత్నించలేదు. నీకూ నాకూ మధ్య ఎప్పుడూ దూరముంచడానికే చూస్తున్నాను. నా ప్రేమలో స్వార్థంలేదు...."

"నీ ప్రేమలో స్వార్థమున్నా నేను నీకా అవకాశమివ్వను. నీకూ కలసింది కాలక్షేపం. ఆదీ మధురమైన కాలక్షేపం...." అంది సుశీల.

"అక్కర్లేదే మగాడికీ, ఆడదానికీ తేడా. నా బాధ

నీకర్థం కావాలంటే నువ్వూ మగాడివి కావాలి. ఆడది కబుర్లతోనూ, ఊహలతోనూ సరిపెట్టుకోగలదు. మగాడికలా కుదరదు. అనుభవం కావాలి. నిన్నిలా కలుసుకోవడం — నీకు మధురం కావచ్చు. నాకు మధురం కాదు....”

సుశీల అతడి వంక జాలిగా చూసి—“ఇంతకీ మన భవిష్యత్తేమిటంటావు?” అంది.

“అంతా మీ నాన్నగారిలో ఉంది—”

సుశీల ఆశ్చర్యంగా — “మా నాన్నగారేం చేయగలరు?” అంది.

“ఏం చేయగలరని కాదు — ఏం చేయలేరూ అని అడుగు....”

సుశీల ఓ క్షణ మాలోచించి—“మీ నాన్నగారు నిన్నింట్లోంచి గెంటేస్తే మా యింటికొచ్చి వుండాలనుకుంటున్నావా?” అంది.

“ఛీ మగాడికంతకంటే అవమానమింకొకటి వుండదు....”

“అయితే మరేమిటి?”

“ఈ ఊళ్ళో వెంకోజీరావుగారి కాలేజీవుంది తెలుసు కదా!”

సుశీల నవ్వి—“వేళాకోళ మాడుతున్నావా? మా నాన్నగారా కాలేజికి ప్రిన్సిపాలని నీకు తెలియదా?” అంది.

“అందుకే కదా—తెలుసా అని కాకుండా తెలుసు కదా అనడిగాను”....అని—“ఆ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టు అడ్వర్టయిజైంది. ఆ పోస్టుకి నేను అప్లై చేయాలనుకుంటున్నాను...” అన్నాడు సుభాష్.

సుశీల ముఖం గంభీరంగా అయిపోయింది—"మా నాన్నగారంటే నాకు చాలా భయం. ఆయన చాలా స్ట్రిక్టు."

"నువ్వేమీ చేయక్కర్లేదు. ఒకసారి నీ అమ్మగారిని మా పిన్నిదగ్గరకు తీసుకుని వెళ్ళు. అక్కడ మా పిన్ని అన్నీ మీ అమ్మకు చెబుతుంది...."

"అంటే మన ప్రేమగురించి మీ పిన్నికి చెప్పేశావా?" అంది సుశీల కంగారుగానూ, భయంగానూ.

"ప్రేమిస్తే భయమెందుకు? మన ప్రేమకు పెద్దలే విధంగానూ ఎదురు చెప్పలేరు. అడ్డొచ్చేదల్లా డబ్బొక్కటే! ఆ డబ్బు నాకక్కర్లేదు...."

"అంటే ఉద్యోగమే నీకు కట్నమంటావు....".

"ఉద్యోగం కట్నమెలాగవుతుంది? అది నా అర్హతతో సంపాదించుకుంటున్నది...." అన్నాడు సుభాష్.

"అర్హతతో సంపాదించుకునే మాటైతే మా నాన్నగారి సాయం నీకెందుకు? ఇంటర్వ్యూలో అది చూస్తారుగా...." అంది సుశీల.

"అర్హతనుబట్టి ఇంటర్వ్యూలో ఎన్నిక చేసే మాటైతే నేనీపాటికే ఉద్యోగం సంపాదించుకుని వుండేవాణ్ణి" అన్నాడు సుభాష్.

సుశీల నవ్వుతూ — "అయితే ఇంకేం—ఉద్యోగం కట్నంగానే అడుగుతున్నావన్న మాట!" అంది.

"నువ్వేమైనా అనుకో—త్వరగా నీతో జీవితం ప్రారంభించాలన్న నా కోరిక తీరాలంటే ఈ ఉద్యోగం నాక్కావాలి. అందుకు నువ్వు కొంత సాయంచేయక తప్పదు" అన్నాడు సుభాష్.

"నేను తప్పకుండా ప్రయత్నిస్తాను. అయితే నామీ దాట్టే ఆశలు పెట్టుకోకు...." అంది సుశీల.

3

"మధ్యాహ్నం రాధాబాయి గారింటికెళ్ళానండీ?" అంది సావిత్రమ్మ.

"రాధాబాయెవరు?" అన్నాడు మోహనమూర్తి. ప్రశ్నైతే వేశాడుకానీ ఆయన ముఖంలో యేమాత్రమూ ఆసక్తి కనబడలేదు.

"టంగుటూరి వారి వీధిలో వున్నారూ — వాళ్ళు!"

"ఓహ్" అని ఊరుకున్నాడు మోహనమూర్తి.

"ఆ రాధాబాయి బావగారబ్బాయి సుభాష్. ఎమ్మే ఎకనామిక్స్ చదివాడు. కుర్రాడు చక్కగా వుంటాడు. మనవాళ్ళే?" అంది సావిత్రమ్మ.

"అలాగా" — అంటూ మోహనమూర్తి పడకకుర్చీలో కూర్చుని పేపరు తీశాడు.

"ఆ అబ్బాయి కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటూటండీ" అంది సావిత్రమ్మ కళ్ళు పెద్దవిచేసి.

మోహనమూర్తి చేతిలోని పేపరు జారిపోయింది— "కట్నం లేకుండా పెళ్ళా? ఆ అబ్బాయికేమైనా లోపముందా...." అన్నాడాయన అప్రయత్నంగా.

"లోపమూ లేదు పాడూ లేదు. కుర్రాడు నిక్షేపంలా వున్నాడు. మన సుశీల వాళ్ళింటికి కెళ్ళినప్పుడు చూశాట్ట. పిల్ల నచ్చిందిట...."

"అయితే ఇంకేం — వాళ్ళ పెద్దలతో మాట్లాడదాం!"

"మాట్లాడొచ్చు కానీ అతడింకా పెళ్ళి చేసుకోనంటున్నాట్ట."

మోహనమూర్తి విసుగ్గా—"ఇంతకీ నువ్వేం చెప్పాలను కుంటున్నావో నా కర్థం కావడంలేదు" అన్నాడు.

"అతడు మీ కాలేజీలో లెక్చరర్ పోస్టుకి అప్లై చేశాడు...."

సావిత్రమ్మ ఇంకా ఏదో చెబుతూండగానే—"అర్థ మయిందిలే—ఇంకేమీ చెప్పకు...." అన్నాడు మోహన మూర్తి.

"ఏమిటర్థమయిందీ?"

"ఆ కుర్రాడు నాద్వారా ఉద్యోగం సంపాదించాలని చూస్తున్నాడు."

"అందులో తప్పేముంది?"

"తప్పేం లేదు. కానీ ఉద్యోగానికి నామీద ఆధార పడే చవటను నా అల్లుడిగా చేసుకోలేను...." అన్నాడు మోహనమూర్తి.

సావిత్రమ్మ నోరు నొక్కుకుని—"హవ్వ—అవేం మాటలండీ—అతడేం తెలివితక్కువవాడు కాదు. ఎమ్మే ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు" అంది.

"సావిత్రీ—నా సంగతి నీకు తెలుసుగా!" అన్నాడు మోహనమూర్తి గంభీరంగా.

"మీ కుద్యోగం ఎవరి సిఫారసూ లేకుండా వచ్చిం దంటారు. అంతేగా! ఆ రోజుల్లో చదువుకున్నవాళ్ళు తక్కువ. ఉద్యోగాలెక్కువ" అంది సావిత్రమ్మ.

"నే నప్పటిమాట కాదు — ఇప్పటిమాట అడుగు తున్నాను. నా సంగతి నీకు తెలుసుగా...." అన్నాడు మోహనమూర్తి మళ్ళీ.

"ఇన్నేళ్ళు కాపురం చేసినా నా గురించి మీకు తెలిసింది కనుక నా—మీ గురించి నాకు తెలియడానికి!" అనేసింది సావిత్రమ్మ.

"తెలియదన్నావు కాబట్టి చెబుతున్నాను విను. ఇంటా బయటా మచ్చలేని జీవితం నాది...."

"అయితే యిప్పుడేమైందిట?"

"నువ్వు చెప్పిన ఆ సుభాష్‌కి మెరిట్ వుంటే తనే సెలక్టవుతాడు. అయితే కాలేజీలో సెలక్టయ్యాడంటే- సుశీలకూ అతడికీ పెళ్ళి జరుగదు."

"ఎందుకని?"

"అంతా యేమని చెప్పుకుంటారు? ప్రిన్సిపాలుగారు మంచి కుర్రాణ్ణి పట్టి ఉద్యోగం వేయించి అల్లుణ్ని చేసుకున్నాడని! అది నాకు నచ్చదు...."

"అందుకని...."

"అతడికి సుశీల నచ్చి పెళ్ళి చేసుకోవాలనుకున్నాడనుకో—ఈ ఉద్యోగానికి అప్లై చేయకూడదు...." అని—"అయినా లాస్టు డేటైపోయిందిగా. మేము ఇంటర్వ్యూ లెటర్సుకూడా పంపేశాం" అన్నాడాయన.

"అతడప్లై చేసేశాట్ట...."

"అయితే ఇంటర్వ్యూకి రాకూడదు...."

"ఇదేం ఘోరమండీ — ఈ రోజుల్లో ఎర చూపించి అల్లుళ్ళను పడుతున్నారందరూ. మీరేమో చేతిలో ఉద్యోగముండీ అది అల్లుడు కాదగ్గవాడి కివ్వనంటున్నారు...." అంది సావిత్రమ్మ.

"చెప్పానుగా—మచ్చలేని జీవితం నాది" అన్నాడు మోహనమూర్తి.

4

"వెతకబోయిన తీగ కాలికి తగిలింది" అన్నాడు సుదర్శనం సంతోషంగా.

"ఏమిటీ విశేషం-నన్ను తీగను చేసేశావు" అన్నాడు ఆనందరావు కుతూహలంగా.

"అన్నీ ఇక్కడెందుగ్గానీ—ఆలా కాఫీ హోటలుకి పోదాం పద!" అన్నాడు సుదర్శనం.

ఇద్దరూ దగ్గర్లో వున్న "పంచవటి" హోటలుకు వెళ్ళి ఫామిలీ సెక్షన్లో కూర్చున్నారు.

"ఆడాళ్ళు లేకుండా ఫామిలీ సెక్షన్ లో కూర్చోవాలంటే తగని సిగ్గు నాకు. అందులోనూ ఇక్కడ మరీను. ప్రేయసీ ప్రియులకోసమున్నట్లు ఇద్దరిద్దరికో చిన్న అపార్టుమెంట్...." అన్నాడు ఆనందరావు ఇబ్బందిగా.

"అందుకే గదా ఇక్కడికి తీసుకొచ్చాను. మనమాటలింకెవ్వరూ వినకూడదు...." అని ఇంకా యేదో అనబోతూండగా అక్కడ ప్రత్యక్షమైన సర్వర్ని చూసి—"రెండు మిక్స్చర్ ఊతప్పాలు" అన్నాడు సుదర్శనం.

"అరె—నాకు ఊతప్పం చాలా ఇష్టమని నీ కెలా తెలుసు?" అన్నాడు ఆనందరావు ఆశ్చర్యంగా.

"ఊతప్పమైతే తయారవడానికి చాలా సేపు పడుతుంది. సర్వరు మనల్ని బాధించడని అది చెప్పాను."

"ఇంతకీ యేమిటంత రహస్యం?"

"నీకు తెలుసు...."

"నిజంగా నాకు తెలియదు...."

"నిరుద్యోగిని—నాకు నీతో రహస్యమేముంటుంది?"

ఆనందరావు నాలిక్కరుచుకుని — "అయాం సారీ బ్రదర్....ఆ విషయమే మర్చిపోయాను. అప్లికేషన్సుకి

లాస్టు డేట్ అప్పుడే వారంరోజులు దాటింది—ఇంటర్వ్యూ లెటర్స్ ఈ వారమే పంపామనుకుంటాను" అన్నాడు.

"నాకు లెటరుకూడా అందింది కానీ—ఇందులో నా అవకాశాలేమిటో చెప్పగలవా?"

ఆనందరావు క్షణం మౌనం వహించి—"నువ్వు చాలా అదృష్టవంతుడివి" అన్నాడు.

సుదర్శనం కళ్ళు మెరిశాయి—"ఏం?"

"మోహనమూర్తిగారు చాలా గొప్పవాడు. దేశంలో అలాంటివాళ్ళు మరికొందరుంటే యెంతో బాగుండేది!" అని నిట్టూర్చాడు ఆనందరావు.

"ఎందుకని?"

"వచ్చిన అప్లికేషన్లన్నీ స్క్రీన్ చేయడమైనాక మొత్తం పదిమందికి ఇంటర్వ్యూ లెటర్స్ పంపారు. అందులో నీదే మొదటి పేరు. అంటే అందరిలోకీ నువ్వే బెస్టు కాండిడేటువి ..."

"అంటే నేను తప్పక సెలక్టవుతానన్న మాట...."

"నూటికి నూరుపాళ్ళ గ్యారంటీ లేదు...."

"ఎందుకని?"

ఆనందరావు నవ్వి—"ఇంటర్వ్యూ లెటరుకీ అపాయింట్‌మెంట్ ఆర్డరుకీ తేడా వుంటుంది కదా...." అన్నాడు.

"సరిగ్గా—ఇదే నాన్నగారుకూడా అన్నారు...."

"బాగా దగ్గర స్నేహితుడివి కాబట్టి నీకింకో రహస్యం చెబుతున్నాను. ఇది నీలో ఆశలు పెంచనూవచ్చు. త్రుంచనూ వచ్చు...."

"చెప్పు!" కుతూహలంగా అన్నాడు సుదర్శనం. ఆనందరావు చెప్పడం మొదలుపెట్టాడు.

"వెంకోజీరావు కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టుకి అప్లై చేసిన వారిలో సుభాష్ అని ఇంకో కాండిడేటున్నాడు. మెరిట్ ప్రకారం అతడి నంబరు మూడు. ఇంటర్వ్యూలో అర్హతలతో పాటు—ఇంటర్వ్యూ పెర్ఫార్మెన్స్‌కు కూడా కొన్ని మార్కులుంటాయి. ఆ మార్కుల్ని అడ్జస్టు చేయడంలోనే ఉంటుంది సెలక్షనంతా. కేవలం ఆ మార్కుల్ని ఉపయోగించి అర్హతల ప్రకారం ఆఖరున వున్నవాడిని పోస్టుకు ఎన్నిక చేయవచ్చు.

సుభాష్ తెలివైనవాడిలా కనబడుతున్నాడు. అతడు ఉద్యోగం కోసం అట్నించి నరుక్కుని వస్తున్నాడు."

"అంటే?" అన్నాడు ఆనందరావుని మధ్యలో ఆపుతూ—సుదర్శనం.

"సుభాష్ మోహనమూర్తిగారమ్మాయి సుశీలను ప్రేమించాడు. కట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటానంటున్నాడు...."

"అయితే ఇంక నాకేం ఛాన్సుండదు—" నీరసంగా అన్నాడు సుదర్శనం.

"అలా నిరుత్సాహపడకు. పూర్తిగా నేను చెప్పేది విను...." అంటూ ఆనందరావు తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

మోహనమూర్తి ఆనందరావుని కలుసుకుని—"నీవల్ల ఓ సాయం కావాలి నాకు" అనడిగాడు. ప్రిన్సిపాలంతటివాడు తనని స్వయంగా కలుసుకుని సాయమడిగే సరికి ఆనందరావు తెల్లబోయాడు. మోహనమూర్తి అతడిని తన పెర్సనల్ రూంలోకి తీసుకుని వెళ్ళి సుభాష్ గురించి చెప్పాడు. ఈ విషయమాయన తనకెందుకు చెప్పాడో

ఆనందరావు కర్థం కాలేదు.

అసలు విషయమేమిటంటే సుభాష్ ప్రిన్సిపాల్ కూతురు సుశీలను ప్రేమించాడు. ఆమెతో మాట్లాడి ఆమె కూడా తనంటే యిష్టపడేలా చూసుకున్నాడు. ఇద్దరికీ పెళ్ళిచేయడం మోహనమూర్తికీ యిష్టమే!

"వీళ్ళ పెళ్ళి జరగాలంటే—సుభాష్ ఆ యింటర్వ్యూకి రాకూడదు. కావాలని నేనతణ్ని సెలక్ట్ చేయకపోయినా ప్రమాదవశాత్తూ అతడు సెలక్టు కావచ్చు. అప్పుడీ పెళ్ళి జరగదు. ప్రేమకావాలో, ఉద్యోగం కావాలో అతడు తేల్చుకోవాలి...."

"నేనేం చేయాలో, చెప్పండి సార్!" అన్నాడు ఆనందరావు.

"నువ్వు సుభాష్‌కు నా ఆశయాల గురించీ, ప్రస్తుత పరిస్థితి గురించీ చెప్పాలి" అన్నాడు మోహనమూర్తి.

ఆనందరావు సరేనన్నాడు కానీ ఇంకా సుభాష్‌ని కలవలేదు. ప్రిన్సిపాల్ గారికి మాత్రం తానతణ్ని కలిశానని చెప్పాడు.

"ఇంతకీ దీని ఫలితమేమవుతుందంటావు?" అన్నాడు సుదర్శనం.

"వ్యవహారం చాలా తిరకాసుగా వుంది. చూస్తూ చూస్తూ ఏ ఆడపిల్ల తండ్రీ కూడా కాబోయే అల్లుడి ఉద్యోగం రాకుండా ఆపడు. మోహనమూర్తి గారు చాలా స్ట్రిక్టు అని నాకు తెలుసు. ఆయనకు కాలేజీలో చాలా మంచి పేరుంది. ఆయన తన పేరు కాపాడుకుందుకు ప్రయత్నిస్తున్నాడు. అంతవరకూ చెప్పగలను...."

"అయితే ఆ సుభాష్ ఉద్యోగం రాకపోవచ్చు...."

"రాకపోవచ్చు, రావచ్చు. నువ్వోసారి వెళ్ళి ఆ

సుభాష్‌ని కలుసుకోకూడదూ?" అన్నాడు ఆనందరావు.

"ఎందుకు?"

"నేను చెప్పాల్సిన మాటలు నువ్వతడికి చెప్పు....అటు నా బాధ్యతా తీరుతుంది. నీకు పనీ జరుగుతుంది...."

సరిగ్గా అప్పుడే ఊతప్పాలు వచ్చాయి.

5

పువ్వులలుంగీమీద అడ్డచారల బనియన్ వేసుకున్నాడు గోపీ. మనిషిని చూడగానే గూండాలా అనిపించడానికి అతడి మీసాలు కారణం కావచ్చు. అతడికి వయసాట్టే వుండదు కానీ బాగా పెద్దవాడిలా కనపడతాడు.

గోపీ చేతిలో యేదో సెక్సు పుస్తకం వుంది. ఒక కాలు స్టూలుమీద పెట్టి, రెండో కాలు నేలమీదఉంచి— నిలబడే అతడా పుస్తకం చదువుతున్నాడు. అలాంటి పుస్తకాలు చదవడం అతడికి బాగా అలవాటయుండాలి. అతడి ముఖం చూస్తుంటే ఏ ఆవేశమూ కనబడదు. అప్పుడతడి ముఖం పిల్లల కథలు చదువుతున్న పెద్దవాడి ముఖంలా వుంది.

అప్పుడెవరో తలుపు తట్టారు.

గోపీ చదువుతున్న పుస్తకాన్ని మూసేసి ఎదురుగా వున్న డ్రాయరు సొరుగులో పెట్టి—వెళ్ళి తలుపుతీసి— "అరే—నువ్వా—సుదర్శనం!" అన్నాడు.

సుదర్శనం, గోపీ బియ్యేలో క్లాస్ మేట్సు. గోపీ బియే ఫెయిలయ్యాడు. ప్యాసు కావడానికి ప్రయత్నం చేయ లేదు.

గోపీని, సుదర్శనాన్ని పక్కపక్కన చూస్తే ఇద్దరూ క్లాస్‌మేట్సనిపించరు.

"నీతో పనుండి వచ్చాను...." అన్నాడు సుదర్శనం.

"నాతో నీకు పనా?" అన్నాడు గోపీ నమ్మలేనట్లు.

కాలేజీ రోజుల్లో క్లాసుల్లో గోపీ అల్లరి బాగా చేసేవాడు. సుదర్శనం అతడి పక్కనే కూర్చునేవాడు. క్లాసు పరీక్షల్లో తన పేపర్లోంచి గోపీని కాపీ కొట్టుకోనిచ్చేవాడు సుదర్శనం. ఇద్దరివీ భిన్నధృవాలే అయినా ఇద్దరి మధ్యా ఆకర్షణకు అదే కారణమయిందేమో! ఇద్దరిదీ మంచి స్నేహం.

సుదర్శనం బియ్యే సెకండ్ క్లాసులో ప్యాసై తర్వాత ఎమ్మే చదివి అందులో ఫస్టు క్లాసు తెచ్చుకున్నాడు. గోపీ గూండాగా జీవితంలో సెటిలయ్యాడు. అతడు తన చదువు, సంస్కారం, తెలివితేటలు ఉపయోగించి-సమాజంలో ప్రజా శ్రేయస్సు పేరు చెప్పి దేశద్రోహ చర్యలు చేసే కొందరు గొప్పవాళ్ళ కుపయోగపడుతున్నాడు. అందువల్ల అతడికి అటు డబ్బుకూ లోటుండడం లేదు. తన వృత్తిలోని ప్రమాదమతణ్ని బాధించడం లేదు.

"అవును నీతోనే!" అంటూ సుదర్శనం అతడికి తన ఉద్యోగంకథ మొత్తం చెప్పాడు.

"చాలా బాగుంది. ఇప్పుడు నేనేం చేయాలి?" అన్నాడు గోపీ.

"నువ్వా సుభాష్‌ని కలుసుకుని ఇంటర్వ్యూకి వెళ్ళొద్దని బెదిరించాలి. అయితే నేను పంపినట్లు చెప్పకూడదు. ప్రిన్సిపాల్ మోహనమూర్తిగారు పంపినట్లే అతడు భావించాలి...." అన్నాడు సుదర్శనం.

"ఉద్యోగం గురించి ఇలా దిగజారిపోయావా?" అన్నాడు గోపీ.

"ఇందులో దిగజారి పోవడమేముంది? సుభాష్ సుశీలను ప్రేమించాడు. సుశీల సుభాష్‌ను ప్రేమించింది

వాళ్ళిద్దరికీ పెళ్ళి జరగాలని సుశీల తండ్రి కూడా అనుకుంటున్నాడు. సుభాష్ ఇంటర్వ్యూకు వెళ్ళకపోవడం వల్ల ముగ్గురి కోరికలు తీరతాయి. వాటితోపాటు కలిసి నాలుగో కోరిక నాది—" అన్నాడు సుదర్శనం.

"సమర్థించుకోవడం చేతనైనవాళ్ళు మర్యాదస్థులు. చేతకానివాళ్ళు గూండాలు. ఈ తేడా ఒక్కటి తీసేస్తే ప్రపంచంలో అందరూ సేరసులే!" అని—"ఏమైతేనేం-నేనీపని తప్పక చేస్తాను. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి నువ్వంటే నాకిష్టం. రెండు—ఈ పని చాలా సులభమైనది. చదువుకున్న కుర్రాళ్ళను బెదిరించడమంత సుఖమైన పని మరొకటుండదు—" అన్నాడు గోపీ.

"చాలా థాంక్స్ గోపీ!" అన్నాడు సుదర్శనం.

"థాంక్స్ సంగతలాగుంచు. ఆ సుభాష్‌ని బెదిరిస్తే చాలా—నా నుంచి ఇంకా సాయమేదైనా కావాలా?" అన్నాడు గోపీ.

"అంటే?"

"కావాలంటే ఆ ప్రిన్సిపాలునే బెదిరించి నీకుద్యోగం వచ్చేలా చేయగలను...." అన్నాడు గోపీ.

"అంత దూరం వద్దులే... ఈమాత్రం సాయం చాలు" అన్నాడు సుదర్శనం. ప్రిన్సిపాలుని బెదిరించడం వరకే గోపీ చేయగలడు కానీ ఆ విధంగా తనకుద్యోగం రాదని సుదర్శనానికి బాగా తెలుసు.

6

పార్కులో ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నారు సుశీల, సుభాష్. సుభాష్ తీవ్రాలోచనలో వున్నాడు.

"మీ నాన్న దీనికింత హడావుడి చేయడం నాకిష్టం

లేదు__" అన్నాడు సుభాష్ కాసేపాగి.

"చెప్పానుగా—ఆయన చాలా స్ట్రిక్ట్...."

"అంతగా స్ట్రిక్టయితే—ఉద్యోగం నాకివ్వొద్దను. కానీ ఇంటర్వ్యూకి రావొద్దంటూ డేమిటి ఈయన...." అన్నాడు సుభాష్.

"నీ క్వాలిఫికేషన్సు బాగున్నాయి. అందువల్ల ఇంటర్వ్యూలో సెలక్టయ్యే అవకాశాలు బాగా వున్నాయి. ఏ కారణంవల్ల నువ్వు సెలక్టయినా_కాబోయే అల్లుడని నీకుద్యోగమిచ్చారని — ఆయనకు చెడ్డ పేరు వస్తుంది. అదాయన భరించలేరు. అందుకోసం నిన్నల్లుడిగా చేసుకోరు. అది నీకిష్టమేనా?"

"అయితే నన్నేం చేయమంటావ్?"

"నీకు నేను కావాలో—ఉద్యోగం కావాలో నిర్ణయించుకో...."

"రెండూ వచ్చే అవకాశమున్నప్పుడు—ఒక టెందుకు వదులుకోవాలి?"

"రెండూ వచ్చే అవకాశంలేదు నీకు...."

"ఎందుకని?"

"నీకు మా కాలేజీలో లెక్చరరుద్యోగం వస్తే—మా నాన్నగారు మన పెళ్ళికొప్పుకోరు...."

"నీ పెళ్ళి మనిష్టప్రకారం జరుగుతుందా—మీ నాన్న ఇష్టప్రకారం జరుగుతుందా?" గంభీరంగా అడిగాడు సుభాష్.

"అంటే?"

"నాకుద్యోగం వచ్చిందనుకో. మీ నాన్న మన పెళ్ళి కొప్పుకోలేదనుకో. అప్పుడు నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటావా — లేదా?"

"మా నాన్నగారిష్టం లేకుండానా?"

"నీకు మైనారిటీ తీరింది. నాకుద్యోగముంటుంది. అయినా నా పెద్దలు, ఇటు నీ పెద్దలూ ఒప్పుకోకపోతే నేం—నీకు నేనూ, నాకు నువ్వుగా హాయిగా బ్రతక లేమా?"

సుశీల కళ్ళు మెరిశాయి—"ఇలా నేనెప్పుడూ ఆలోచించలేదు సుభాష్! ఇదేదో బాగానే వుందనిపిస్తోంది."

"అందుకే — నేను ఇంటర్వ్యూకి వెళ్ళి తీరతాను. నాకుద్యోగం వస్తే—మీ నాన్నకిష్టం లేకపోయినా మన పెళ్ళి ఆగదు...." అన్నాడు సుభాష్.

"జస్టేమినిట్—మిస్టర్ సుభాష్!" అన్న మాటలు వినిపించి ఆ ప్రేమికుల జంట ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

వారికి గోపీ కనిపించాడు.

అతణ్ణీ, అతడి వేషాన్నీ చూసి ఇద్దరూ నివ్వెరబోయారు.

"కంగారు పడకండి. నన్ను మీకొకాకలసినవాళ్ళే పంపించారు...." అంటూ గోపీ వాళ్ళ కెదురుగా కూర్చున్నాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు సుభాష్.

"నా పేరు గోపీ. ఈ ఊళ్ళో గూండాగా నాకు మంచి పేరుంది. అందులోనూ నేను చదువుకున్న గూండాని...."

"నీకు నేనెలా తెలుసు?"

"తెలియని వాళ్ళను తెలుసుకోవడం, తెలియని వాళ్ళకు తెలియజెప్పడం నా ప్రత్యేకత...." అంటూ గోపీ ఓసారి మీసం దువ్వుకున్నాడు.

సుశీల భయంగా — "సుభాష్ — నాకు భయంగా వుంది—" అంది.

"మీ నాన్న పంపిన మనిషిని. నేనంటే నీకు భయ మెందుకు?" అన్నాడు గోపీ హుందాగా నవ్వుతూ.

"ఎవరు నువ్వు?" అంది సుశీల అతడి మాటలకు తెల్లబోయి.

"మీ ఇద్దరికీ మీ నాన్న అభీష్టం ప్రకారం పెళ్ళి జరగాలనుకుంటున్న వాణ్ని...." అన్నాడు గోపీ.

సుభాష్ మాట్లాడకుండా గోపీ వంక చురుగ్గా చూశాడు.

"అలా చూసి లాభంలేదు. నేను చెప్పినట్లు వినాలి" అన్నాడు గోపీ.

"ఏమిటి నువ్వు చెప్పేది?"

"వెంకోజీరావు కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టుకి ఇంటర్వ్యూకి నువ్వు వెళ్ళకూడదు...."

"ఎందుకని?"

"చూడు మిస్టర్ సుభాష్! నేను సీదాసాదామనిషిని. అయితే గూండాను. నన్ను ప్రశ్నలడగడం నీకు మంచిది కాదు. ఎందుకంటే నా జవాబుల్ని నువ్వు అరాయించు కోలేవు...." అన్నాడు గోపీ.

"నేనూ గూండాలకు భయపడేవాణ్ని కాదు. నీ జవాబులేన్నే కాదు—అవసరమైతే నిన్నే అరాయించు కోగలను—" అన్నాడు సుభాష్ కోపంగా.

"అయితే అరాయించుకో—" అంటూ తన జేబు లోంచి ఓ బటన్ నైఫ్ తీశాడు గోపీ. అతడు బటన్ నొక్కగానే ఆరంగుళాల చాకు బైటకు వచ్చింది. అది తళతళ మెరుస్తోంది.

సుభాష్ ఏదో అనాలని పెదవి కదిపాడు. కానీ గొంతు పెగలలేదు. అతడి చూపులా చాకుమీద నే నిలబడ్డాయి.

"ఇంటర్వ్యూకి నువ్వు వెళ్ళవు. ఒకవేళ నామాట కాదని బయల్దేరావా—దీంతో నే ఆ రోజు నిన్నాపవల్సి వుంటుంది—" అనేసి గోపీ అక్కణ్ణించి లేచి వెళ్ళి పోయాడు. అతడు వెళ్ళినా అక్కడ కాసేపు నిశ్శబ్దం అలాగే వుండిపోయింది.

"సుభాష్—ఏమిటిదంతా?" అంది సుశీల నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"ఇది-మీ నాన్న తన ప్రిస్టేజిని నిలబెట్టుకునే పద్ధతి!" అన్నాడు సుభాష్.

అతడి గొంతులోని విసురు, వెటకారం సుశీల కర్థమయ్యాయి.

7

"నాన్సెన్స్!" అన్నాడు మోహనమూర్తి.

"మీ వ్యవహారమంతా నాన్సెన్స్ గానే వుంది. ఆఖరికి మీరిలా దిగజారిపోతారనుకోలేదు. కాబోయే అల్లుడికుద్యోగమిప్పించడంవల్ల మీ పరువు పోదు. ఏ పనికైనా గూండాలను నియమించడం మీ జీవితంలో మాయని మచ్చ...." అంది సావిత్రమ్మ.

"సావిత్రీ—నీకర్థంకావడంలేదా—ఇది మనమ్మాయీ, ఆ అబ్బాయీ కలిసి చేస్తున్న అబద్ధపు ఆరోపణ. ఇది నువ్వెలా నమ్ముతున్నావు?" అన్నాడు మోహనమూర్తి బాధగా.

"అమ్మాయబద్ధం చెప్పదు. సుభాష్‌ని తను ప్రేమించాన్న విషయమే అది మన దగ్గర దాచలేదు...." అం

సావిత్రమ్మ.

"నువ్వు నాకంటే యెక్కువగా దాన్ని నమ్ముతావా?"

"ఊఁ."

"నేనలాంటి పనులెందుకు చేస్తాను?"

"ఎందుకో సుభాష్ చెప్పాడు—అమ్మాయికి...."

"ఎందుకట?"

"వీరరాఘవయ్యగారికీ వూళ్ళో నాలుగు షాపులున్నాయి. ఆయన తలచుకుంటే ఈ వూళ్ళో యెంత పెద్దవాళ్ళనైనా నాశనం చేయగలడు ..."

"అయితే?"

"ఆయన మూడో కొడుకు నాగభూషణం మీ కాలేజీలో లెక్చరర్ పోస్టుకి అప్లై చేశాడు. అతడికింటర్వ్యూ వచ్చింది...."

"వస్తే?"

"అసలతడికి ఇంటర్వ్యూయే రాకూడదు. అయినా వచ్చింది. ఇప్పుడుద్యోగమూ వస్తుంది...."

"అలాగా—ఇంకా నీకేం తెలుసో చెప్పు...." వెటకారంగా అన్నాడు మోహనమూర్తి.

సావిత్రమ్మ చలించలేదు. ఆమె చెప్పుకుపోసాగింది.

వీరరాఘవయ్య మోహనమూర్తిని కలుసుకుని హెచ్చరించడంవల్లనే నాగభూషణానికి ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది. ఉద్యోగంకూడా అతడికే ఇవ్వక తప్పదు. ఆ విషయంలో మోహనమూర్తి అసహాయుడు. అందువల్ల కావాలనుకున్నా సుభాష్‌కాయన ఉద్యోగం ఇప్పించలేడు. ఆ విషయం ఒప్పుకోడానికి అహం అడ్డువస్తోంది. ఇంటర్వ్యూకని వచ్చి సెలక్టుకాకపోతే సుభాష్ సుశీలను

కాదంటారేమోనని భయపడి ఆయన ముందరి కాళ్ళకు బంధం వేసున్నాడు.

"అయితే నేనేం చేయాలంటావు?"

"సుభాష్‌కు నిజం చెప్పేయండి. అతడు మిమ్మల్నర్థం చేసుకుని మీకు సహకరిస్తాడు...." అంది సావిత్రమ్మ.

"నిజం నీకు చెబుతాను. అది నువ్వు సుభాష్‌కు చెప్పు...."

"ఊఁ."

"నాగభూషణం వీరరాఘవయ్య అసలు కొడుకు కాదు. ఆయన అసలు కొడుకులందరూ వ్యాపారంలోనే వున్నారు. వీరరాఘవయ్య ఉంపుడుకత్తె కొడుకు నాగభూషణం. ఇది జగమెరిగిన సత్యం. కానీ ఎవ్వరూ ఆ మాట అతడి యెదురుగుండా అనరు. నాగభూషణం అప్లికేషన్సులో తన తండ్రి పోయినట్లు రాస్తాడు. కానీ వీరరాఘవయ్య పూర్తిగా అతడి ఆలనా పాలనా చూసు కుంటాడు...."

మోహనమూర్తి యింకా యేదో చెప్పబోతూండగా-

"ఈ సోదంతా నాకెందుకుగానీ — అసలు విషయం చెప్పండి...." అంది సావిత్రమ్మ విసుగ్గా.

"స్క్రీనింగ్‌లో నాగభూషణం అప్లికేషన్ తీసే యాల్సిందే. మేమసలు యెనిమిది పేర్లు ఇంటర్వ్యూకని సెలక్టు చేశాం. ఈలోగా వీరరాఘవయ్యనుంచి ఒత్తిడి వచ్చింది. నాగభూషణం పేరు ఇంటర్వ్యూకి పిలవడానికి ఎన్నుకోక తప్పలేదు. అతడి గురించి అలాంటివాడినే మరొకణ్ని కూడా కలపాల్సొచ్చింది. మొత్తం పది మందిని పిలిచాం—"

"అంటే — ఇంకేం — సుభాష్ చెప్పింది నిజమేనన్న

మాట. వీరరాఘవయ్య ఒత్తిడికి లొంగిపోయాక-మీరింకా స్ట్రిక్ట్ కేమిటండీ—" అంది సావిత్రమ్మ.

"వీరరాఘవయ్య స్వయంగా నన్ను కలుసుకున్నాడు. ఆయనకు మా కాలేజి కమిటీ మెంబర్స్ చాలామంది తెలుసు. ఏటా మా కాలేజీకి యేదో రూపేణా విరాళా లిస్తూంటాడాయన. ఆయన మాటకు కొంత విలువివ్వక తప్పదు. అంతవాడూ యేమన్నాడో తెలుసా—మూర్తి గారూ, వాడిని ఇంటర్వ్యూకి పిలిస్తే చాలు. సెలక్ట్ చేయక్కర్లేదు....అని మరీమరీ వేడుకున్నాడు."

"ఏమైతేనేం—ఒత్తిడికి లొంగి అర్హతలేనివాణ్ని ఇంటర్వ్యూకి పిలిచారా లేదా—సుభాష్ కరెక్టుగానే చెప్పాడన్నమాట!"

మోహనమూర్తి ముఖం ఎర్రబడింది—"నేను ఒత్తిడికి లొంగవచ్చు. అయితే ఇతరుల స్వార్థానికి తల వంచినట్లు నా స్వార్థానికి తలవంచలేను. వీరరాఘవయ్య మాట వినకపోతే నా ఉద్యోగానికేం భంగంరాదు. కష్టమంటూ వుంటే అది మా కాలేజీకి. సుభాష్ ఉద్యోగమంటే అది పూర్తిగా నా స్వార్థానికి సంబంధించిన విషయం."

"అంటే మీరు ఆ నాగభూషణానికే ఉద్యోగ మిస్తారా?"

"అవన్నీ నీ కనవసరం. సుభాష్ సుశీలను పెళ్ళి చేసుకోవాలనుకుంటే—ఈ ఉద్యోగం విషయం మర్చిపోయి తీరాలి."

"మీరు చాలా మొండి....అయితే మీ కూతురికీ మీ పోలికలే వచ్చాయి. ఏం చేస్తారో చూసుకోండి" అంది సావిత్రమ్మ.

8

"ఏమోయ్ గోపీ కులాసానా?" అన్నాడు వీరరాఘవయ్య.

"ఏదోనండి—మీ దయవల్ల" అన్నాడు గోపీ.

"మా దయేముంది. నువ్వు కులాసాగా వుంటేనే మా వంటి వాళ్ళకు కులాసా" అని స్వరం తగ్గించి—"నీకు రామేశంగారు తెలుసా?" అన్నాడు.

"ఏ రామేశంగారండీ?" అన్నాడు గోపీ.

"ప్రొఫెసర్ రామేశంగారు—తల్లావఝ్ఝుల వారి వీధిలో వుంటున్నారూ—ఆయన" అన్నాడు వీరరాఘవయ్య.

"తెలుసునండి" అన్నాడు గోపీ.

"రేపు పద్నాలుగో తారీఖున ఆయన ఇల్లు కదలకుండా ఆపాలి నువ్వు. ఒక వేళ ఇల్లు కదిలినా అనుకున్న చోటుకు చేరకూడదాయన."

గోపీ ఆశ్చర్యంగా—"ఎందుకండీ?" అన్నాడు.

"పనుందిలే....!" అన్నాడు వీరరాఘవయ్య.

"పనేమిటో తెలియకుండా పనిలోకి దిగితే ఒక్కోసారి వేడి పుట్టదండి."

"నీ పని నువ్వు చేయి. వేడి అదే పుడుతుంది...." అన్నాడు వీరరాఘవయ్య. ఆయనకింకెక్కువ మాట్లాడ్డం ఇష్టం లేనట్లు అర్థం చేసుకుని గోపీ అక్కణ్ణించి సెలవు తీసుకుని తిన్నగా సుదర్శనం ఇంటికి వెళ్ళాడు.

అప్పుడు సుదర్శనం ఇంట్లోనే వున్నాడు. గోపీని చూసి ఆప్యాయంగా తన గదిలోకి ఆహ్వానించాడు.

"నీకు నచ్చని కబురొకటి తెచ్చాను...." అన్నాడు

గోపీ.

"ఏమిటది?" అన్నాడు సుదర్శనం కంగారుగా.

"సుభాష్‌ని నేను బెదిరించాను. అతడికా బెదిరింపు చాలని నేననుకుంటున్నాను. కానీ ఇంటర్వ్యూ రోజు వచ్చేసరికి అతడిలో వేడి పుట్టవచ్చు. ఆ రోజుకతడి న్యూసెన్స్ వలా కాద్దామా అనుకున్నాను. కానీ ఆ రోజునే నాకింకో పని తగిలింది..."

"ఏమిటది?"

"అది నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు. నన్ను నమ్మి నాకెందరో ఎన్నో రకాల పనులు చెబుతారు. అవన్నీ అందరికీ చెప్పేమాటైతే ఇంక నావల్ల ప్రయోజన మేమిటి?"

"చెప్పొద్దులే కానీ—సుభాష్‌ని ఇంటర్వ్యూకి వెళ్ళకుండా ఆపలేవా?"

"ఆపాలంటే ఆ పని ఇంకెవరికైనా అప్పజెప్పాలి. ఇది నీకూ నాకూ మధ్యనున్న రహస్యం. మూడో మనిషికి తెలియడం నా కిష్టంలేదు" అన్నాడు గోపీ.

"అసలు పని జరక్కపోయాక రహస్యం కాపాడి మాత్రం యేమి లాభం?" అన్నాడు సుదర్శనం దిగులుగా.

"ప్రతి నేరానికీ కొన్ని హద్దులుంటాయి. ఈ ఇంటర్వ్యూ విషయంలో ఇంతకు మించి చేయడం న్యాయం కాదు. అదృష్టం బాగుంటే అన్నీ నీకు సహకరిస్తాయి...." అన్నాడు గోపీ. ఆ తర్వాత అతి దెక్కువసేపు వుండలేదు.

గోపీ ఇలా వెళ్ళగానే అలా వచ్చాడు ఆనందరావు. అతడి ముఖంలో ఆత్రుత వుంది.

"ఏమిటి విశేషం?" అని సుదర్శనం ఆనందరావు

పలకరించాడు.

"నీ అదృష్టం బాగోలేదు. ఉద్యోగంమీద ఆశలు పెట్టుకోకు" అన్నాడు ఆనందరావు.

"ఏమయింది?"

"మోహనమూర్తి నేననుకున్నంత స్ట్రిక్టు కాదు. ఇంటర్వ్యూకి ఎన్నికైన అభ్యర్థుల్లో నాగభూషణం అనే వాడిని కలిపాడాయన. అందుక్కారణం వీరరాఘవయ్య" అంటూ ఆ వ్యవహారం చెప్పాడానందరావు.

"ఒక చిన్న ఉద్యోగాని కెంత పోటీ?" అన్నాడు సుదర్శనం నీరసంగా.

"అయితే ఉద్యోగం నాగభూషణానికి రాదు"— అన్నాడానందరావు.

"మరి?"

"ప్రిన్సిపాల్ చాలా తెలివైనవాడు. ముందు ఎవ రెవరో ఎన్నిక చేసినవాడు నాగభూషణం గురించి ఒక తిడిరాగానే యేం చేశాడో తెలుసా—అలాంటివాడినే ఇంకొకణ్ని కూడా ఎన్నిక చేశాడు. అతడి పేరు విద్యా సాగర్. ఈ విద్యాసాగర్ కూడా ఊళ్ళో బాగా పేరున్న గణపతిరావుగారి మేనల్లుడు. ఆయనకూ కాలేజీలో చాలా పలుకుబడి వుంది."

"అయితే?"

"వీరరాఘవయ్య పలుకుబడికి గణపతిరావు పలుకు బడితో భేటీ పడుతుంది. ఇద్దరికిద్దరూ హేమాహేమీలు. వీళ్ళిద్దరిలో ఏ ఒక్కరిని ఎన్నిక చేసినా ఊళ్ళో భూకంపం వచ్చేస్తుంది."

"అరే—బావ్ రే!" అన్నాడు సుదర్శనం.

"ఈ తిరకాసంతా ఇప్పుడిప్పుడే నాకర్థమవుతోంది"

అన్నాడు ఆనందరావు.

"అయితే ఇప్పుడేం జరుగుతుంది?"

"మోహనమూర్తి చాలా తెలివిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన కమిటీ మెంబర్సుకి తన సమస్య చెప్పుకున్నాడు. వాళ్ళైతే ఆయనమీద జాలిపడి సుభాష్‌ని సెలక్టు చేయమని సూచించారుకూడా. వాళ్ళ పాయింట్ యేమిటంటే వీరరాఘవయ్య, గణపతిరావు—వీళ్ళిద్దరిలో ఏ ఒక్కరిని మాత్రమే సంతృప్తిపరచినా, అసంతృప్తికి గురిచేసినా ఇబ్బంది. ఇద్దరి కాండిడేట్సునీ తిరస్కరించడంలో సమస్య లేదు. అలాంటప్పుడు ప్రిన్సిపాల్ గారి కాండిడేటుని ఫేవర్ చేయడం మంచిది కదా.... ఎవరో మనవాళ్ళకే ఉద్యోగమొస్తే మనకూ తృప్తిగా వుంటుందని వాళ్ళాయనతో అన్నారు. ఆయన దానికి ఒప్పుకోలేదు. పైగా ఈ క్లిష్టపరిస్థితిలో తను సెలక్షన్ బోర్డులో వుండనని కూడా ఆయన స్పష్టంచేశాడు. అందుకోసం ఓ వారంరోజులు సెలవుకూడా పెడుతున్నాడు."

"పాపం—ఆయన నిజంగానే స్ట్రిక్టు మనిషిలాగున్నాడు...." అన్నాడు సుదర్శనం అప్రయత్నంగా.

"అలా అప్పుడే జాలిపడిపోకు. ఇలా జరిగినప్పుడే నాకాయన నిజాయితీమీద అనుమానం కలిగింది. ఎందుకంటే అయిన వాళ్ళ నుద్యోగానికి సెలక్టు చేయాలనుకున్నప్పుడెవరైనా ఇలాంటి పనే చేస్తారు. తనేమో సెలక్షన్ కమిటీలో వుండడు. సెలవుపెట్టి ఇంటి దగ్గర కూర్చుంటాడు. తనకు బాగా నమ్మకమున్న వాళ్ళను సెలక్షన్ కమిటీ చెయిర్మన్ చేస్తాడు. అయినవాళ్ళు సెలక్టవుతారు. ఆ సెలక్షన్‌లో ఆయనకేమీ సంబంధముండదు. ఇది అందరికీ తెలిసిన రహస్యం. అయినా

యెవ్వరూ తప్పుపట్టలేరు...."

"నువ్వనవసరంగా అనుమానిస్తున్నావు...."

"సెలక్షన్ కమిటీ చైర్మనెవరో తెలిస్తే నువ్వామాట అనవు. ప్రొఫెసర్ రామేశం ప్రిన్సిపాల్ మోహనమూర్తికి ప్రాణస్నేహితుడు...."

సుదర్శనం ఆలోచనలో పడ్డాడు.

"అసలిప్పటి పరిస్థితి ఏమిటి?"

వెంకోజీరావు కాలేజీలో ఒకే ఒక ఎకనామిక్స్ లెక్చరర్ ఉద్యోగం. దానికి మొత్తం పదిమందిని ఇంటర్వ్యూకి పిలిచారు. పిలిచినవారిలో తను ఉత్తమ అభ్యర్థి. తనకున్న అవకాశాలెలాంటివో తెలియదు. ఆ పదిమందిలో చిట్టచివర పేర్లున్న నాగభూషణం, విద్యాసాగర్ లకు బాగా పలుకుబడి వుంది. ఇద్దరిలో యే ఒక్కరు మాత్రమో అప్లై చేసి వుంటే తప్పక సెలక్టయుండేవారు. ఇద్దరూ అప్లై చేశారు కాబట్టి ఏ ఒక్కరికీ అవకాశంలేదు. ప్రిన్సిపాల్ తను సెలక్షన్ కమిటీలోంచి తప్పుకుని తన ప్రాణ స్నేహితుడు ప్రొఫెసర్ రమేశాన్ని కమిటీ చైర్మన్ చేశాడు. మోహనమూర్తి తనకిష్టం లేదంటూనే వుంటాడు. రామేశం సుభాష్ని యెన్నిక చేస్తాడు.

ఇదంతా ఓ పెద్ద నాటకం. ఉద్యోగాల విషయంలో ప్రతిచోటా ఇలాంటి అన్యాయాలు జరిగిపోతూండడం వల్లనే సమర్థులకుద్యోగాలు రావడంలేదు. ఫలితంగా దేశం నష్టపోతోంది.

"అయితే మనం చేయగలిగిందేమన్నా వుందా?" అన్నాడు సుదర్శనం.

"అపగలిగితే రామేశాన్నికూడా ఇంటర్వ్యూ కమిటీకి

వెళ్ళకుండా ఆపాలి!" అన్నాడు ఆనందరావు.

"నాలుగుద్యోగాలకి ప్రయత్నిస్తే—చీఫ్ మినిస్టర్ని కదానిక్కూడా సరిపడే అనుభవం వచ్చేలా వుంది—" అనుకున్నాడు సుదర్శనం.

9

ఒక ఎయిర్ కండిషన్డు గదిలో కలుసుకున్నారు వీరరాఘవయ్య, గణపతిరావు....

"ఆ ప్రిన్సిపాలు గోలెట్టేసున్నాడు. మీ యిద్దర్లో యెవరో ఒకరు తేల్చుకోకపోతే — ఇద్దరికీ ఉద్యోగమివ్వడం కుదరదని.... మావాడప్పై చేశాడని తెలిస్తే నా మేనల్లుణ్ని వద్దని చెప్పేద్దును. ఇప్పుడేమో తీరా వాడు అప్పై చేశాడు. వాడికి రాకుండా మీవాడికొస్తే—నా చెల్లెలు నా ప్రాణం తీస్తుంది...." అన్నాడు గణపతిరావు.

వీరరాఘవయ్యకూడా ఓ క్షణం ఆలోచించి—"మనవంటి వాళ్ళ బలాబలాలు తేల్చుకోవాల్సిన రంగస్థలం వెంకోజీరావు కాలేజీ మాత్రం కాదు. నాదీ నీకులాంటి పరిస్థితే! ఏం చేయాలో నాకూ తోచడంలేదు. ఇద్దర్నీ కలిపి యెక్కడికైనా తోలేయడం మంచిదేమో! ఎందుకంటే మావాడు ఇంటర్వ్యూకి వెళ్ళకపోతే చివరిక్షణాల్లో మీవాడికి మూడ్ వచ్చి ఇంటర్వ్యూకి వెళ్ళవచ్చు—" అన్నాడు.

ఇద్దరూ కలిసి ఆలోచించి నాగభూషణానికీ, విద్యాసాగర్ కీ కాశ్మీర్ కార్యక్రమం ఫిక్స్ చేశారు. అప్పుడు గణపతిరావు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత వీరరాఘవయ్య గోపీ కబురంపించాడు.

"ప్రొఫెసర్ రామేశం విషయంలో ఏం చేశావు?"

"ఫోన్ చేసి బెదిరించాను...."

"ఏమన్నావు?"

"ఆ ఏడో తేదీన యిల్లు కదిలితే ప్రమాదమని చెప్పాను...."

"ఆ రోజే కదా ఇంటర్వ్యూ — అందరికీ తెలిసిపోతుంది...."

"తెలిస్తే మాత్రం — ఇదంతా ఎవరూహించగలరు? ఆయన ఇంటర్వ్యూకి వెళ్ళడం వల్ల మీ అబ్బాయికి అన్యాయం జరుగుతుందని మీరే ఇంత పని చేశారని యెవ్వరూ అనుమానించరు...."

"అంటే నీకు నా అవసరం తెలిసిపోయిందన్నమాట."

గోపీ గర్వంగా నవ్వి—"నా ప్రయత్నం లేకుండానే నాకీ విషయం తెలిసింది. ఆ రోజు ప్రొఫెసర్ రామేశాన్ని ఆపమని మరికొందరు నన్నడిగారు—" అన్నాడు.

"ఎవరు వాళ్ళు?"

"ఇంకెవరు—కాండిడేట్సు తాలూకే!"

"వాళ్ళ పేర్లు చెప్పు...."

"తెలుసుకోవాలనుకుంటే మీకు అసాధ్యంకాదు. కానీ అందువల్ల మీకేమీ ప్రయోజనంలేదు. నాకేమో రహస్యం దాచలేదన్న అసంతృప్తి మిగులుతుంది...."

వీరరాఘవయ్య నిట్టూర్చి—"మావాడు ఇంటర్వ్యూ కాండిడేట్ గా వుంటే—ఇలాంటి పని యెవరు చేసినా నేనే చేశానని అనుమానిస్తారు. అందుకే మావాణ్ని ఇంటర్వ్యూకే పంపడంలేదు...." అన్నాడు.

"అంటే గణపతిరావుగారి మేనల్లుడికి ఢోకా లేదన్నమాట...."

వీరరాఘవయ్య ఆశ్చర్యంగా—"వాటంచూస్తే నీవు మొత్తం కథంతా తెలిసినట్లే వుందే—" అని—"వాడూ ఇంటర్వ్యూకి రాడు. ఇద్దరూ కలిసి కాశ్మీర్ వెడుతున్నారు. ఇంటర్వ్యూ అయ్యాకే వస్తారు...." అన్నాడు.

"అయితే నేను రామేశాన్ని ఆపుతాను. అప్పుడెవ్వరూ మిమ్మల్ననుమానించరు. అంతేకాకుండా ఇలాంటి వ్యవహారాల్లో మీలాంటి వాళ్ళేకాకుండా ఇతరులూ జోక్యం కలిగించుకోవచ్చని అందరికీ తెలుస్తుంది." అన్నాడు గోపీ.

అతడిలాగనడానికి కారణముంది. రామేశం గురించి అతడికి సుదర్శనం చెప్పాడు. రామేశం ఇంటర్వ్యూకి వెళ్ళకపోతే — మరొకడు సెలక్షన్ కమిటీ చైర్మన్ కావచ్చు. రామేశమే చైర్మన్ అయితే సుదర్శనానికి యే అవకాశమూ వుండదు. ఆయన సుభాష్‌ను తప్ప వేరొకణ్ని సెలక్ట్ చేయడు.

ఎలాగూ వీరరాఘవయ్య రామేశాన్ని ఆపుచేసే పని చెప్పాడు. అటు సుభాష్‌నీ ఇటు రమేశాన్నీ ఆపగలిగితే చాలా బాగుంటుంది. సుదర్శనంకోసం తనింకో మనిషిని నియోగించాలి. ఇంతకాలం ఈ విషయం మూడో మనిషికి తెలియకూడదనుకున్నాడు గానీ — ఇది సుదర్శనానికి జీవిత సమస్య. ఎలాగో అలా అతడికి సాయపడాలి.

"నువ్వు చెప్పింది బాగుంది. నా కాండిడేట్ లేకపోయినప్పటికీ రామేశాన్నెవరో బెదిరిస్తున్నారంటే— ఎవరూ నన్ననుమానించరు—" అన్నాడు వీరరాఘవయ్య.

సరిగ్గా అప్పుడే ఆయన పక్కబల్లమీద ఫోన్ మ్రోగింది.

"హలో!" అన్నాడాయన. కాసేపటిలోనే ఆయాన ముఖంలో రంగులు మారాయి. ఆయన ఎవరితో మాట్లాడుతున్నాడో గోపీకి అర్థం కాలేదు.

వీరరాఘవయ్య ఫోన్ పెట్టేసి—"నువ్వు రామేశాన్ని వదిలి పెట్టేయాలి" అన్నాడు.

"ఎందుకని?" అన్నాడు గోపీ తెల్లబోయి.

"ఇప్పుడు నాకు ఫోన్ చేసింది ప్రిన్సిపాల్ మోహన మూర్తి. ఆయనకు రామేశం ఫోన్ చేసి తన ఇబ్బంది చెప్పుకున్నాట్ట. రామేశానికి రక్షణ యేర్పాటు చేయమని ఆయన నన్ను కోరుతున్నాడు."

"మీరేం రక్షణ శాఖాధికారీ కాదు, పోలీస్ డిపార్టుమెంటూ కాదు. ఈ విషయం ఆయన మీకు ఫోన్ చేయుడమేమిటి?" అన్నాడు గోపీ.

"ఆయనకూ నాకూ కొన్ని మొహమాటాలున్నాయి. ఇలాంటి సమయాల్లో నా ప్రతిభ చూపించడంతో—ఆయనకూ నామీద గౌరవముండడు. ఇందులో నాకేమీ శ్రమ లేదు. రామేశాన్ని బెదిరించిందెవరో కూడా నాకు తెలుసు. అందువల్ల నువ్వీ విషయం మర్చిపో....అదే మనిద్దరికీ మంచిది...."

గోపీకి యేమనాలో అర్థం కాలేదు. రామేశాన్ని ఆపాలని అతడికుంది. రామేశాన్ని ఆపమన్న వీరరాఘవయ్యే ఇప్పుడు రామేశం జోలికి వెళ్ళవద్దంటున్నాడు.

గోపీ ఆలోచిస్తూండగానే వీరరాఘవయ్య యేదో నంబరుకు డయల్ చేసి—"హలో—ప్రొఫెసర్ రామేశం గారేనా—నమస్కారమండీ.... మీ సంగతి నాకిప్పుడే ప్రిన్సిపాల్ గారు చెప్పారు. మీరేమీ భయపడకండి. మనమేమీ ఇక్కడ గాజులు తొడుక్కునీ, చేతులు

ముడుచుకునీ కూర్చోలేదు. మా మనుషులు వెయ్యికళ్ళతో మిమ్మల్ని కాపాడుతూంటారు. మీకే ప్రమాదమూ వుండదు" అన్నాడు.

10

వీరరాఘవయ్య ఇంటినుంచి తిన్నగా మరో యింటికి వెళ్ళాడు గోపీ. జగ్గూ వున్నాడా అనడిగాడక్కడ.

"ఓ రెండ్రోజులపాటు ఇంటికి రానని చెప్పాడు బాబూ!" అంది ఓ వృద్ధురాలు. ఆమె జగ్గూ తల్లి అయియుండవచ్చు.

గోపీ నిట్టూర్చి అక్కణ్ణించి కదిలాడు. జగ్గూ అతడి వయసువాడు. అతడివంటివాడు. ఈ వ్యవహారంలో జగ్గూ సాయం తప్ప వేరెవ్వరి సాయం తీసుకోకూడదని నిర్ణయించుకున్నాడతడు.

"సుదర్శనం దురదృష్టవంతుడు...." అనుకున్నాడు గోపీ.

తనకు చేతనైనంతలో గోపీ సుదర్శనానికి సాయపడాలనే అనుకుంటున్నాడు. కానీ ఎక్కడా కలసిరావడం లేదు.

ఇంక ఇంటర్వ్యూకి రెండే రెండ్రోజులు టయిముంది. ప్రొఫెసర్ రామేశాన్ని ఆపే అవకాశం వచ్చిందనుకుంటే వచ్చినట్లే చేయి జారిపోయిందది.

తనకూ సుదర్శనానికీ వున్న పరిచయం—కొంత మందికైనా తెలుసు. అందుకని చివరి అస్త్రంగా జగ్గూను ఉపయోగించాలనుకున్నాడు. తను ముందుగా సుభాష్‌ని బెదిరించి వుంటాడు. ఆఖరున జగ్గూ సుభాష్‌ని ఆపుతాడు.

జగ్గూకు గోపీ—గోపీకి జగ్గూ—ఎన్నో వ్యవహారాల్లో సాయపడినా వారిద్దరూ వేర్వేరు ముఠాలకు చెందినవారే

వని అంతా అనుకుంటూరు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకరి వ్యవహారాల కొకరు ఎదురుపడకుండా, ఇబ్బంది, జోక్యం కలిగించుకోకుండా చూసుకుంటూరు.

ఇప్పుడా జగ్గూ దొరకలేదు. అందువల్ల తనే స్వయంగా సుభాష్‌ని ఆపాలనుకున్నాడు గోపీ. ఈ అభిప్రాయంతో సాయంత్రం అతడు పార్కుకి వెళ్ళాడు.

అక్కడ సుభాష్, సుశీల యధాస్థానంలో యధాప్రకారం కబుర్లు చెప్పుకుంటున్నారు.

"హలో మిస్టర్ సుభాష్!" అన్నాడు గోపీ.

సుభాష్ ఉలిక్కిపడి—"నువ్వా?" అన్నాడు.

"అవును— నేనే! నా హెచ్చరిక గుర్తుందో లేదో వని ఒకసారి గుర్తుచేసిపోడానికి వచ్చాను...." అన్నాడు గోపీ.

"హెచ్చరికేమిటి — నాకేమీ గుర్తులేదే!" అన్నాడు సుభాష్.

గోపీ జేబులోంచి బటన్ నైఫ్ తీసి బటన్ ప్రెస్ చేసి "ఇప్పుడు గుర్తొచ్చిందా?" అన్నాడు.

సుభాష్ తల అడ్డంగా ఊపి—"లేదు— కానీ ఓ సారి వెనక్కి చూడు" అన్నాడు తాపీగా.

గోపీ వెనక్కి తిరిగి తనులిక్కిపడి "అరె—జగ్గూ— నువ్వా?" అన్నాడు.

వాళ్ళిద్దరూ ఒకరికొకరు తెలిసినవారేనని గమనించగానే సుభాష్ కలవరపడ్డాడు కానీ అక్కణ్ణించి కదలేదు.

జగ్గూ గోపీ ఒకరినొకరు పలకరించుకున్నారు.

సుభాష్ బాబాయి జగ్గూకి గురుతుల్యుడు. ఎవరో ఇంటర్వ్యూకి వెళ్ళొద్దని బెదిరిస్తున్నారని తెలిసి అతడి

పిన్ని జగ్గూక్కి బురంపింది. రెండ్రోజులనుంచీ అతను సుభాష్‌తోనే వుంటున్నాడు. జగ్గూ గోప్పీ కథకూడా విని—"మనమిద్దరం ఒకరితో ఒకరు పోటీపడ్డం ఇంతవరకూ జరగలేదు. ఇప్పుడేం చేద్దామంటావు?" అన్నాడు.

వృత్తిరీత్యా ఇద్దరికీ ఒకరితోడు ఒకరికి అవసరం. వృత్తిరీత్యానే మున్ముందు ఇద్దరూ పోటీపడవలసి రావచ్చుకూడా. ఇప్పుడీ చిన్న విషయానికి ఇద్దరూ బలాబలాలు పరీక్షించుకోవడం గోప్పీ కిష్టంలేదు.

"సరేలే— నే నింకో మార్గం చూసుకుంటాన్లే...." అన్నాడు గోప్పీ.

జగ్గూ గోప్పీకి థాంక్స్ చెప్పుకున్నాడు. సుభాష్ మాత్రం గోప్పీ జగ్గూకి భయపడ్డాడని అనుకున్నాడు.

గోప్పీ అక్కణ్ణించి వెళ్ళి సుదర్శనాన్ని కలుసుకుని— "నీకే విషయంలోనైనా సాయం చేయగలను కానీ ఉద్యోగం విషయంలో చేయలేను. చేతనైతే ఆ రామేశాన్ని కానీ, మోహనమూర్తినికానీ నువ్వే బెదిరించు. లేదా ఆ సుశీలను రేప్ చేసి నువ్వే పెళ్ళాడు. ఏంచేసినా నువ్వే స్వయంగా సాధించుకోవాలి. ఇంటర్వ్యూకి వెళ్ళకుండా ఆ సుభాష్‌ని ఆపాలనుకోవడం అన్యాయమనిపిస్తోంది" అని సెలవు తీసుకున్నాడు.

11

"కథ మళ్ళీ మొదటికి వచ్చింది—" అనుకున్నాడు సుదర్శనం.

ఇలాంటి అపూర్వావకాశం మళ్ళీ తనకు రాకపోవచ్చు. పెద్దపెద్దవాళ్ళ అడ్డంకులన్నీ తొలగిపోయాయి. తనకిప్పుడు సుభాష్ ఒక్కడే పోటీ. ఆ సుభాష్‌కీ తనకీ ఒకటే తేడా! అతడు ప్రిన్సిపాల్ కూతురు సుశీలను ప్రేమించి

పెళ్ళి చేసుకోబోతున్నాడు. సుశీలను పెళ్ళి చేసుకుంటే తనకూ ఆ ఉద్యోగం రావచ్చు.

ఇంతకాలం తన ఆలోచన ఈ దార్లో మళ్ళలేదు.

తనూ అందంగానే వుంటాడు. సుశీల గురించి ముందు నుంచి ప్రయత్నిస్తే ఆమె తననే ప్రేమించి వుండేది. ఇప్పుడామె సుభాష్‌ని ప్రేమిస్తోంది. ఆ ప్రేమనుంచి ఆమె మనసును మళ్ళించాలంటే ....

"నువ్వే ఆమెను రేప్ చేసి పెళ్ళాడు."

ఇవి గోపీ మాటలు. సుదర్శనం చెవుల్లో గింగురు మంటున్నాయి.

రేప్ చేయడం నేరం కావచ్చు. కానీ తనద్వారా ఆ వనిత కన్యాయం జరక్కపోతే అది నేరం కాదు. రేప్ చేశానని సుశీల తనని అసహ్యించుకోవచ్చు. కానీ భర్తగా ఆమె తనను తప్పక ఆదరిస్తుంది.

"అదే—అన్నింటికీ మంచిమార్గం.... కానీ.... ఎలా?"

సుదర్శనం బుర్రలో ఆలోచనలు తిరుగుతున్నాయి. అతి దెక్కువ జాప్యం చేయలేదు. తనకున్న టైము ఎంతో లేదు.

ఆరోజు గడిస్తే మర్నాడే ఇంటర్వ్యూ....

పార్కులో సుభాష్, సుశీల కలుసుకుంటున్నారు. టైము యేడయ్యేదాకా సుశీల అక్కడే వుంటుంది. అప్పుడు సుభాష్, సుశీల విడిపోతారు. తాను సుశీలనను సరిస్తాడు. దారిలో పలకరిస్తాడు. సుభాష్ గురించి గొప్పగా నాలుగు కబుర్లు చెప్పి ఆమెను తప్పుదారిన నడిపిస్తాడు. ఓ చిన్న అడ్డదారి వుంది. ఆమె దృష్టి నా అడ్డ దారిని గుర్తించనీయకుండా—ఆమెనా దారిలో నడిపించ గలిగితే....

ఆ ప్రాంతంలో కొన్ని మానభంగాలు జరిగాయి. అటువైపు జనాలాట్టే వెళ్ళరు. అక్కడ ప్రదేశమూ అందుకనువుగా వుంటుందంటారు.

తను చూడ్డానికి పెద్దమనిషిలా వుంటాడు. ఓ క్షణం క్రితం వరకూ నిజంగా కూడా పెద్దమనిషే! అందువల్ల సుశీల నాదారికి తీసుకుని వెళ్ళడం కష్టంకాదు.

అక్కడ తను అనుకున్నది సాధిస్తాడు.

అంతా అయిపోయాక కన్నీళ్ళతో విలపిస్తున్న సుశీల నలా వదిలి వెళ్ళిపోకుండా—ఆవేశంలో జరిగిన పొరపాటును క్షమించమంటాడు. తనామెను పెళ్ళి చేసుకుందుకు సిద్ధంగా వున్నానంటాడు. నెమ్మదిగా ఉద్యోగం గురించి చెప్పవచ్చు.

తన పథకంలో ప్రమాదముందని సుదర్శనానికి తెలుసు. అంతవరకూ ఏ నేరమూ చేయని తాను ఒక అబలపై అత్యాచారం చేయగలడా అన్నది సందేహాస్పదమని అతడికి తెలుసు. తను నేరస్థుడిగా పట్టుబడితే జీవితమే సర్వనాశనమవుతుందన్న విషయంకూడా అతడికి తెలుసు.

తనకు తన కుటుంబం పట్ల, సమాజం పట్ల వున్న బాధ్యతలతడికి గుర్తున్నాయి. ఒక అబలపై అత్యాచారం చేసినవాడికి అధ్యాపకుడయ్యే అవకాశముండదేమో నన్న విషయమూ అతడు గుర్తించాడు.

కానీ—తనకు ఇంటర్వ్యూ లెటర్ వచ్చినపుడు తండ్రి అతడితో—"ఆశను ఎక్కువగా నమ్ముకున్నవాడు తన ప్రాణాలు నిలబెట్టుకోవడం సంగతెలాగున్నా—నిరాశ ఎదురైనపుడు—ఎదుటివాళ్ళ ప్రాణాలు తీయాలనుకునేటంత ఘోరావేశానికి గురి అవుతాడు" అన్న మాటలు గుర్తులేవు.

స్త్రీకి మానభంగం హత్యతో సమానమన్న గుర్తింపూ అతడిలో లేదప్పుడు.

12

టైము ఏడయింది.

"ఛై ..." అంది సుశీల.

"ఛై .." అన్నాడు సుభాష్. అతడికి కాస్త దూరంలో జగ్గూ వున్నాడు. సుభాష్ అక్కడ్నించి బయల్దేరాక జగ్గూకూడా అక్కడ్నించి కదిలాడు.

మరోవైపు గేట్లోంచి సుశీల బైటకు వచ్చింది. అప్పుడే ఆమెకు ఎదురుపడ్డాడు సుదర్శనం. అతడి నామె చూసింది కానీ పట్టించుకోలేదు.

"హలో!" అన్నాడు సుదర్శనం. అతడి గొంతు వణికింది.

సుశీల ఆశ్చర్యంగా చూసింది.

"నా పేరు సుదర్శనం!" అన్నాడతడు.

ఆమె అతడివంక ప్రశ్నార్థకంగానే చూసింది.

"మీ పేరు సుశీలకదూ? మీరు ప్రిన్సిపాల్ మోహనమూర్తిగారమ్మాయి కదూ!" అన్నాడు సుదర్శనం.

అతడడిగిన పద్ధతినిబట్టి మర్యాదస్థుడిగానే భావించి- "అరే మీకు మా నాన్నగారు తెలుసా?" అంది సుశీల.

"అయ్యో—ఆయన్ని తెలియని వాళ్లెవరుంటారు?" అని—"నేను మిమ్మల్ని కల్సుకుని మీతో మాట్లాడాలని చాలాకాలంగా అనుకుంటున్నాను. మీతోపాటు కలిసి అడుగులేయొచ్చా?" అన్నాడు సుదర్శనం.

సుశీల నవ్వి ... "మా నాన్నగారు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. కానీ నాతో మీరేం మాట్లాడతారు?"

"నా ఫ్రెండొకడు—అయ్యేయస్ పాసయ్యాడు.

ఇంకా పోస్టింగు రాలేదు. వాడి దగ్గర మీ ఫోటో వుంది. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. కానీ ధైర్యంచేసి ముందుగా మీకే ఆ మాట చెప్పాలని తాపత్రయం. వాడి దగ్గరే నేను మీ ఫోటో చూశాను...." సుదర్శనం కల్పితగాధ నొకటి మొదలుపెట్టాడు.

సుశీలకీ కల్పితగాధ ఆకర్షణీయంగానే వుంది. ఆమె, సుదర్శనంతో కలిసి అడుగులు వేస్తోంది.

అలా కొంతసేపటికి అతడనుకున్న అడ్డదారి దగ్గర పడింది.

తగ్గిందనుకున్న వణుకు మళ్ళీ సుదర్శనంలో ప్రారంభమైంది.

సుశీల మాత్రం అతడి కబుర్లు వింటూ మధ్య మధ్య ప్రశ్నలు వేస్తోంది. క్రమంగా అడ్డదారి దగ్గర పడుతోంది.

"అలా పోదాం — దగ్గర దారి..." అన్నాడు సుదర్శనం అడ్డదారివైపు చూపిస్తూ.

సుశీల క్షణం తటపటాయించి—"అదాట్టే మంచి దారికాదు...." అని—"అయినా మీలాంటివారు పక్కనుంటే భయముండదులెండి...." అని తనే అటువైపు తిరిగింది.

సుదర్శనం తనూ అటువైపు తిరగాలనుకున్నాడు. కానీ కాళ్ళు సహకరించలేదు. ఎవరైనా ముందుకుతోస్తే తప్ప అతడు ముందుకు వెళ్ళేలా లేడు.

సుశీల నాలుగడుగులు వేసి వెనక్కి తిరిగింది.

సరిగ్గా అప్పుడే శరవేగంతో వస్తున్న స్కూటరొకటి సుదర్శనాన్ని గుద్దుకుంది. హారన్ మోగుతున్నా సుదర్శనం తప్పుకోలేక పోయాడు. అప్పుడక్కడ యాక్సిడెంటయింది.

స్కూటర్ మీద ఇద్దరున్నారు. వాళ్ళకు చిన్న దెబ్బలు తగిలాయి. సుదర్శనం మాత్రం క్రిందపడ్డవాడు మరి లేవలేదు. అతడికి స్పృహ తప్పింది.

సుశీల కతడెవరో తెలియదు. కానీ స్కూటర్ వాలాల సహాయంతో — ఆమె అతడిని దగ్గరలోని ప్రయివేట్ నర్సింగ్ హోంలో చేర్చింది.

సుదర్శనం దగ్గర ఏ వివరాలూ లేకపోవడంవల్ల ఆమె అక్కణ్ణించే ఇంటికి ఫోన్ చేసి — తానొక అపరిచితుణ్ణి నర్సింగ్ హోంలో చేర్చాననీ — అతడికి స్పృహవచ్చేవరకూ నర్సింగ్ హోంలో వుండవలసిన బాధ్యత తనకున్నదనీ చెప్పింది. కాసేపటికి — మోహనమూర్తి అక్కడికి వచ్చి అక్కడి పరిస్థితి చూసి — "మనమిక్కడుండనవసరంలేదు. అతడికి స్పృహ రాగానే నర్సింగ్ హోంవారు మనింటికి ఫోన్ చేసి చెబుతారు. అవసరమనుకుంటే అప్పుడు సాయపడొచ్చు —" అన్నాడు.

వాళ్ళిద్దరూ యింటికి వెళ్ళిపోయారు. అయితే సుశీలకు మనసు మనసులోలేదు. ఆమె తరచుగా రాత్రి నర్సింగ్ హోంకి ఫోన్ చేస్తూనే వుంది — సుదర్శనానికి స్పృహ వచ్చిందా అని.

13

తెల్లవారుఝామున నాలుగు గంటలకు సుదర్శనానికి స్పృహ వచ్చింది. తనెక్కడున్నదీ ముందతడికి తెలియలేదు. దగ్గరలో వున్న నర్సు కొంత చెప్పాక మొత్తం జరిగినదంతా అతడూహించుకోగలిగాడు. అప్పుడతడికి తనమీద తనకే ఏహ్యభావం కలిగింది.

సుభాషిని ప్రేమించిన సుశీలను తను మానభంగం

చేయాలనుకున్నాడు. స్పృహ తప్పిపోయిన తనవామె నర్సింగ్ హోంలో చేర్పించింది.

జీవితమంటే ఉద్యోగం సంపాదించడమొక్కటే కాదు. కానీ ఉద్యోగం కోసం—తను ఒక అతివ జీవితంతోపాటు తన జీవితాన్నికూడా నాశనం చేసుకోబోయాడు.

"నా చేత పాపం జరక్కుండా దేవుడు అపాడు. అయినా నానుంచి కూడా కొంత నిష్కృతి తప్పదు. రేపే యింటర్వ్యూకి వెళ్ళను. ఆ విధంగా సుభాష్‌కి ఉద్యోగం వస్తుంది. సుశీల సుఖపడుతుంది..." అనుకున్నాడు సుదర్శనం.

ఈలోగా అతడికి స్పృహ వచ్చిందని తెలిసి డాక్టరతణ్ని చూడవచ్చాడు—"పాపం—ఆ అమ్మాయెవరో మీ గురించి చాలా ఆదుర్దాపడింది. మీకు పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు. స్పృహ తప్పిందంటే అందుకు కారణం షాక్ అయుండాలి. లేదా ఎందుకల్లో ఆ సమయంలో మీ మెదడు బలహీనంగా ఉండివుండాలి." అని—"ముందు మీ ఇంటికి కబురు చేయాలి. మీ వివరాలు చెప్పండి...." అన్నాడు డాక్టరు.

సుదర్శనం తన ఇంటి చిరునామా చెప్పగానే ఆయన మోహనమూర్తి ఇంటికి ఫోన్ చేసి కబురు చెప్పాడు.

కాసేపట్లో మోహనమూర్తి స్వయంగా నర్సింగ్ హోంకి వచ్చాడు. ఆయన సుదర్శనంతో-"మా అమ్మాయి కబురు చెప్పడానికి మీ ఇంటికి వెళ్ళింది. కాసేపట్లో మీ వాళ్ళొస్తారు. అన్నట్లు నీకీరోజు ఇంటర్వ్యూ వుందికదూ!" అన్నాడు.

"మీకెలా తెలుసు?" అన్నాడు సుదర్శనం ఆశ్చ

ర్యంగా.

"ఇంటర్వ్యూ కాల్స్ పంపిన పదిమంది అడ్రసులూ కంఠతా వచ్చేశాయి. నీ అడ్రసు చెప్పగానే నువ్వు మా ఇంటర్వ్యూ సుదర్శనానివేనని అర్థమైంది నాకు...."

"కానీ- నేను ఇంటర్వ్యూకి వెళ్ళడం లేదండి...." అన్నాడు సుదర్శనం.

"ఎందుకని?"

"ఈ యాక్సిడెంట్ కాగానే ఏదోలాగుంది...."

"అలాగనకు. ఇందులో నీకు మంచి ఛాన్సుంది...."

"నాకేం ఛాన్సు లేదండి—ఎవరో సుభాష్ అనే అతడికి మంచి ఛాన్సుందని కాలేజీలో టాకుందిటండి.."

ప్రిన్సిపాల్ ముఖం ఎర్రబడింది—"ఆ సుభాష్ నాకు కాబోయే అల్లుడు. ఉద్యోగంకోసం నన్నూరికే సతాయిస్తున్నాడు. నాకు కాబోయే అల్లుడు కాబట్టి అతడికా ఉద్యోగం వచ్చే ప్రసక్తిలేదు. మా కాలేజీ కమిటీ మెంబర్సు కొందరు నన్ను కాదని సుభాష్ కుద్యోగం ఇవ్వాలనుకుంటున్నారు. అలాచేస్తే మనసులో ఏ మూలో నేను సంతోషిస్తానని వారి నమ్మకం. అందుకే నా మాట నెగ్గడంకోసం నా మిత్రుడు ప్రొఫెసర్ రామేశంను సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా చేశాను. అతడెవ్వరిమాటా వినడు. అందరిలోకీ మంచి అర్హతలున్న నీ పేరు రామేశానికి సూచించాను కూడా. ఎట్టి పరిస్థితిల్లోనూ అతడు సుభాష్‌ను సెలక్టు చేయడు. చేస్తే నేనుద్యోగానికి రాజీనామా చేస్తానని రామేశానికి తెలుసు...."

సుదర్శనం చటుక్కున మంచంమీంచి లేచి మోహన మూర్తి కాళ్ళమీద పడిపోయి—"ఈ రోజుల్లో మీలాంటి వాళ్ళుంటారని కలలోకూడా ఊహించలేను...."

అన్నాడు.

"నన్నూహాల్లో ఉంచకపోయినా ఫరవాలేదు. నా ఊహాల్ని మీలాంటి వాళ్ళు నిజం చేస్తే చాలు...." అన్నాడు మోహనమూర్తి.

సుదర్శనానికి కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఇంత సులభమైన వ్యవహారానికి— తానెంత తతంగం చేశాడు?

ప్రిన్సిపాలు సిక్టు అని తనకెందరో చెప్పారు. నిజాన్ని, మంచిని— అంత సులభంగా నమ్మని తాను ఎన్నో రోజులు ఇంత క్షోభా అనుభవించాడు.

మంచిని నమ్మి వుంటే....?

ఇంకా యేమైనా మోహనమూర్తిలో అనుమానాలుంటే....తనకుద్యోగం రాగానే సుదర్శనానికి అవి తీరిపోయాయి.

ఎదుటివాళ్ళ నిజాయితీనీ, మంచితనాన్నీ మోహనమూర్తి తప్పుగా అంచనా వేయడనడానికి నిదర్శనంగా- సుభాష్ సుశీలను పెళ్ళిచేసుకున్నాడు.

—:అయిపోయింది:—